బ్యాడ్మింటన్‌కు
సాయి ప్రణీత్ వీడ్కోలు



5లో.

RNI NO :Title-Code :-TELTEL02102

# జర్నలిస్ట్ వార్త

తెలుగు దినపత్రిక
అనుక్షణం ప్రజలపక్షం...

WANTED
రిపోర్టర్లు కావలెను
జర్నలిస్ట్ వార్త
దిన పత్రికలో పనిచేయుటకు
తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని
అన్ని జిల్లా, మండల, కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను.
KKR NEWS
ఎడిటర్ : బిర్రు కరుణాకర్
Cell: 9701249103

సంపుటి - 1 సంచిక - 160 మంగళవారం 5 మార్చి 2024 ఎడిటర్ : బిర్రు కరుణాకర్ పేజీలు -5 వెల - 5/-

Published From Warangal : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts





# రాష్ట్ర ప్రగతికి సహకరిస్తాం

ఆదిలాబాద్ లో ప్రధానిమోదీ

- వికసిత్ భారత్ లక్ష్యం
- ఇది ఎన్నికల సభ కాదు..
....ప్రగతి ఉత్సవ సభ
- బీఆర్ఎస్, కాంగ్రెస్ ఒక్కటే
- కాళేశ్వరంలోతప్పు జరిగింది
- ఆదిలాబాద్ లో ప్రధానిమోదీ
- ఎన్ టీపీఎస్ జాతికిఅంకితం
- రూ.30 వేల కోట్ల రైల్వే
....ప్రాజెక్టులు ప్రారంభం
- వివిధ అభివృద్ధిపనులకు
... వర్చువల్ శంకుస్థాపన

**మార్చి4(జర్నలిస్ట్ వార్త):** తెలంగాణ ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడంలో కేంద్ర ప్రభుత్వం సహకారం.ఎల్లప్పుడూ ఉంటుందని ప్రధాని నరేంద్ర మోదీ హామీ ఇచ్చారు. దేశంలో జరుగుతున్న అభివృద్ధికి ఆదిలాబాద్ కార్యక్రమాలే నిదర్శనమని పేర్కొన్నారు. అన్నిరంగాల్లోనూ రాష్ట్రం, దేశం అభివృద్ధి చెందాలన్నదే తమ ఆకాంక్ష అని తెలిపారు. సోమవారం ఉదయం ఆదిలాబాద్ కు చేరుకున్న ప్రధాని నరేంద్ర మోదీకి సీఎం రేవంత్ రెడ్డి, గవర్నర్ తమిళిసై, మంత్రి సీతక్క, కేంద్రమంత్రి కిషన్ రెడ్డి సాదరంగా స్వాగతం పలికారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత తొలిసారి రాష్ట్రానికి వచ్చిన ప్రధాని మోదీకి శాలువాకప్పి సీఎం రేవంత్ రెడ్డి ఆయనకు సన్మానించారు.

మిగతా 2లో.

## ఆదిలాబాద్ వేదికగా కాంగ్రెస్, బీజేపీ చీకటి ఒప్పందం బయటపడింది



2లో.

# మూడు నెలల్లో 30 వేల ఉద్యోగాలు

## ఇదీ మా ప్రభుత్వ పనితీరు: రేవంత్



**మార్చి4(జర్నలిస్ట్ వార్త):** కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన 3 నెలల్లోనే 30వేల ప్రభుత్వ ఉద్యోగాలను కల్పించామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. లెక్చరర్స్, టీచర్స్, డ్రగ్ ఇన్ స్పెక్టర్, మెడికల్ సిబ్బందికి ఉద్యోగ నియామక పత్రాలను ఇవాళ ఎల్బీస్టేడియంలో అందజేశారు ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. టిఎస్పిఎస్సి ని పూర్తిగా ప్రక్షాళనలు చేశాం. మూడు నెలల్లోనే 30 వేల ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించామని.. గత ప్రభుత్వం ఫామ్ హౌస్ మత్తులో ఉండే నిరుద్యోగ సమస్యలను పట్టించుకోలేదన్నారు.. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రశ్నాపత్రాలు ఏ జిరాక్స్ సెంటర్లో భయటపడతాయో తెలియని పరిస్థితి ఉండేది. కనీసం పెంపుడు కుక్కకు ఉన్న విలువ.. పేదోడి ప్రాణానికి లేదా అని ప్రశ్నించారు. కుటుంబ ఉద్యోగుల కోసం ప్రజల ఉద్యోగాలను ఊడగొట్టేందుకు ప్రయత్నం చేసింది. నేను కార్పొరేట్ స్కూల్లో చదువుకోలేదు.. ప్రభుత్వ పాఠశాలలోనే చదువుకున్నాను. గుంటూరు, గుడివాడలో చదువుకొని వచ్చిన వాళ్ళు నాకు ఇంగ్లీషు రాదని ఎగతాళి చేస్తున్నారు. విద్యార్థుల పై పెట్టే దానిని ఖర్చుగా చూడవద్దని.. పెట్టుబడిగా చూడాలన్నారు.గత ప్రభుత్వ హయాంలో 6000 ప్రభుత్వ పాఠశాలలను గత ప్రభుత్వ మూసివేసింది. ఉద్యోగాలు రాక ఎంతో ఆత్మహత్య చేసుకోవడానికి కారణం ఎవరు అని ప్రశ్నించారు. మీ కళ్ళల్లో ఆనందం చూసేందుకే ఎల్బీ స్టేజియంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించామని తెలిపారు.నిరుద్యోగ యువతకు భరోసా కల్పించాలని.. మూడు నెలల్లో మా పనితీరు చూసి తీర్పు ఇవ్వండి అని కోరారు.

# కాంగ్రెస్ ప్రభుత్వానికి పాలనపై అవగాహన లేదు

- బీఆర్ఎస్ అధినేత కేసీఆర్
- ఖమ్మం, మహబూబాబాద్ పార్లమెంటరీ నియోజకవర్గాల పరిధిలోని ముఖ్యనేతలతో కేసీఆర్ భేటీ
- రాబోయే కాలం మన బీఆర్ఎస్‌దేనని విశ్వాసం
- పార్లమెంట్ ఎన్నికల్లో అభ్యర్థులను గెలిపించుకోవాలని సూచన



**మార్చి4(జర్నలిస్ట్ వార్త):** కాంగ్రెస్ ప్రభుత్వానికి పాలనపై ఏమాత్రం అవగాహన లేదని బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ విమర్శించారు. తెలంగాణ భవన్‌లో ఖమ్మం, మహబూబాబాద్ పార్లమెంటరీ నియోజకవర్గాల పరిధిలోని ముఖ్యనేతలతో ఆయన సోమవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాబోయే కాలం మన బీఆర్ఎస్‌దేనని విశ్వాసం వ్యక్తం చేశారు. కరీంనగర్ తర్వాత ఖమ్మంలో భారీ బహిరంగ సభ ఉంటుందన్నారు. పార్టీ నేతలు కలిసికట్టుగా పని చేసి రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో అభ్యర్థులను గెలిపించుకోవాలని సూచించారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి ముగ్గురితో సమన్వయ కమిటీ ఉండాలని సూచించారు.





## మెగా డీఎస్సీ దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ప్రారంభం...

- పూర్తి వివరాలతో బులెటిన్ విడుదల
- ఏప్రిల్ 2 వరకు దరఖాస్తుల స్వీకరణ
- డీఎస్సీ పరీక్ష కోసం దరఖాస్తును ఆన్‌లైన్‌లోనే నింపాలి...
- మహబూబ్ నగర్, రంగారెడ్డి, మైదరాబాద్, మెదక్, నిజామాబాద్, అదిలాబాద్, కరీంనగర్, వరంగల్, ఖమ్మం, నల్లగొండ, సంగారెడ్డిలలో పరీక్ష కేంద్రాలు
- రిక్రూట్మెంట్ పరీక్షలు మే-జూన్ నెలల్లో నిర్వహించే అవకాశం

2లో.

# రాష్ట్ర ప్రగతికి సహకరిస్తాం

(మొదటి పేజీ తరువాయి)

తెలంగాణ ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడంలో కేంద్ర ప్రభుత్వం సహకారం.ఎల్లప్పుడూ ఉంటుందని ప్రధాని నరేంద్ర మోదీ హామీ ఇచ్చారు. దేశంలో జరుగుతున్న అభివృద్ధికి ఆదిలాబాద్ కార్యక్రమాలే నిదర్శనమని పేర్కొన్నారు. అన్నిరంగాల్లోనూ రాష్ట్రం, దేశం అభివృద్ధి చెందాలన్నదే తమ ఆకాంక్ష అని తెలిపారు. సోమవారం ఉదయం ఆదిలాబాద్ కు చేరుకున్న ప్రధాని నరేంద్ర మోదీకి సీఎం రేవంత్ రెడ్డి, గవర్నర్ తమిళీసై, మంత్రి సీతక్క, కేంద్రమంత్రి కిషన్ రెడ్డి సాదరంగా స్వాగతం పలికారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత తొలిసారి రాష్ట్రానికి వచ్చిన ప్రధాని మోదీకి శాలువాకప్పి సీఎం రేవంత్ రెడ్డి ఆయనకు సన్మానించారు. అనంతరం అండర్ డ్రైనేజీ నిర్మాణం సహా ఆరు ప్రాజెక్టులకు వర్చువల్ గా శంకుస్థాపన చేశారు. అదిలాబాద్-బేల మహారాష్ట్ర రోడ్డు విస్తరణ పనులను, రైల్వే విద్యుదీకరణ మార్గాన్ని పర్చువల్ గా ప్రారంభించారు. రామగుండం ఎన్టీపీఎస్ ని జాతికి అంకితం చేశారు. ఈ సందర్భంగా ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో నిర్వహించిన బీజేపీ విజయ సంకల్ప సభలో ప్రధాని సరేంద్రమోదీ మాట్లాడుతూ.. తెలంగాణ కుటుంబానికి నా నమస్కారాలు అంటూ తెలుగులో ప్రసంగాన్ని ప్రారంభించారు. రాష్ట్రంలో ఇదొక కొత్త అధ్యాయమన్నారు. ప్రత్యేక రాష్ట్రంగా తెలంగాణ ఏర్పడి, కేంద్రంలో తమ ప్రభుత్వం ఏర్పడి పదేళ్లు పూర్తయిందన్నారు.. ఈ సభ ఎన్నికల సభ కాదని, ఎన్నికలకు ఇంకా దండోరా మోగలేదని, కేవలం వికసిత ఉత్సవాల్లో పాల్గొనేందుకు ఇక్కడకు వచ్చానని మోదీ వివరించారు. యావత్ భారత దేశం ఈ వికసిత ఉత్సవాన్ని తిలకించాలనే ఈ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. వికసిత్ భారత్ లక్ష్యంగా పాలన సాగిస్తున్నామని, రూ.56 వేల కోట్ల అభివృద్ధి పనులను చేపట్టామని తెలిపారు. రామగుండం ఎన్టీపీసీ సెకండ్ యూనిట్ తో తెలంగాణ విద్యుత్ అవసరాలు తీరుతాయని, 800 మెగావాట్ల విద్యుత్ ను ఉత్పత్తి చేస్తుందని తెలిపారు. ఆర్థిక వ్యవస్థ బలపడితే దేశంపై విశ్వాసం పెరుగుతుందన్నారు. 15 రోజుల్లో దేశంలో 2 ఐఐటీలు, ఐఐఎంలు, ఎయిమ్స్ ను ప్రారంభించామని తెలిపారు. బీజేపీ హయాంలో ఆదివాసి మహిళ రాష్ట్రపతి అయ్యారు. ఆదివాసీలను బీజేపీ సర్కారు గౌరవిస్తుందనేందుకు ఇదే నిదర్శనమన్నారు. ఫిర్ ఏక్ బార్ మోదీ సర్కార్.. కుటుంబ పార్టీలను నమ్ముకోకండి అని మోదీ పిలుపునిచ్చారు. కాంగ్రెస్, బీఆర్ ఎస్ రెండూ ఒక్కటేనని ప్రధాని మోదీ ధ్వజమెత్తారు. కాళేశ్వరం విషయంలో బీఆర్ఎస్ తప్పుచేసిందన్న కాంగ్రెస్ ఇప్పుడేం చేస్తుందని ప్రశ్నించారు. కాంగ్రెస్ పాలనలోనూ ప్రజలకు ఏమీ జరగదన్నారు. మోదీ గ్యారెంటీ ఇస్తే.. అది ఖచ్చితంగా జరుగుతుందన్నారు.

ఈ సభలో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి సూట్లాడుతూ తెలంగాణ అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తుంద న్నారు. రామగుండంలో యూరియా కంపెనీని మోదీ ప్రారం భించారని తెలిపారు. వరంగల్ లో వ్యాగన్ తయారీ కంపెనీకి శంకుస్థాపన చేశారని పేర్కొన్నారు. రాష్ట్రంలో రూ.30 వేల కోట్ల విలువైన రైల్వే ప్రాజెక్టులు, తెలంగాణ నుంచి 4 వందేలా రత్ రైళ్లను ప్రారంభించారని తెలిపారు.

అగ్ర నేతల రాకతో ఆదిలాబాద్లో భద్రత కట్టుదిట్టం చేశారు పోలీసులు. దాదాపు 2000 మంది పోలీసులతో భారీ భద్రత కల్పించారు. స్థానిక పోలీసులతో పాటు 300 ఎస్పీజ్ భద్రత అదనం, బజీ రంగనాథ్ నేతృత్వంలో ఏడుగురు ఎస్పీలు, ఏడుగురు అడిషనల్ ఎస్పీలు, 13 మంది డీఎస్పీలు, 40 మంది సీఐలు, 101 మంది ఎస్సైలు, 20 మంది మహిళా ఎస్సైలు, మరో 1,100 మంది పోలీస్ సిబ్బందితో భద్రత కట్టుదిట్టం చేశారు.

# మెగా డీఎస్సీ దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ప్రారంభం...

%మెగా డీఎస్సీ దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమైంది. ఈ రోజు (మార్చి 4) నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నారు. నేటి నుంచి ఏప్రిల్ 2 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులను స్వీకరించనున్నారు. దరఖాస్తుకు సంబంధించి ఈ రోజు సమగ్ర వివరాలతో విద్యాశాఖ బులెటిన్‌ను విడుదల చేసింది. డీఎస్సీ పరీక్ష కోసం దరఖాస్తును ఆన్‌లైన్‌లోనే నింపాలి. దరఖాస్తుదారులు అన్ని వివరాలను పొందుపరచాలి. దరఖాస్తుదారు సంతకంతో కూడిన పాస్ పోర్ట్ సైజ్ ఫోటోను జతపరచాలి. పరీక్ష ఫీజు రూ.1,000గా ఉంది. అయితే పరీక్ష ఎప్పుడు ఉంటుందో వెల్లడించలేదు. కానీ పరీక్ష కేంద్రాలను పేర్కొన్నారు. మహబూబ్ నగర్, రంగారెడ్డి, హైదరాబాద్, మెదక్, నిజామాబాద్, అదిలాబాద్, కరీంనగర్, వరంగల్, ఖమ్మం, నల్లగొండ, సంగారెడ్డిలలో కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.అత్యధికంగా హైదరాబాద్‌లో 878 ఖాళీలు ఉన్నాయి. నల్గొండలో 605, నిజామాబాద్‌లో 601, ఖమ్మంలో 757, సంగారెడ్డిలో 551, కామారెడ్డిలో 506 ఖాళీలు ఉన్నాయి.తెలంగాణ విద్యా శాఖ 11,602 ఉపాధ్యాయ పోస్టుల కోసం డీఎస్సీ నోటిఫికేషన్‌ను విడుదల చేసిన విషయం తెలిసిందే. ఈ రిక్రూట్మెంట్ పరీక్షలు మే-జూన్ నెలల్లో నిర్వహించే అవకాశముంది. స్కూల్ అసిస్టెంట్, లాంగ్వేజ్ పండిట్, ఫిజికల్ ఎడ్యుకేషన్ ఉపాధ్యాయులతో పాటు సెకండరీ గ్రేడ్ టీచర్ పోస్టుల కోసం నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. తెలంగాణ విద్యా శాఖ దీంతో పాటు మరో నోటిఫికేషన్‌ను కూడా విడుదల చేసింది.

డీఎస్సీ ద్వారా 6,508 సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులు (ఎస్జీటీ), 2,629 స్కూల్ అసిస్టెంట్లు, 727 లాంగ్వేజ్ పండిట్స్, 182 ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్లు (పీఈటీ), 1,106 స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్లు, 79 స్కూల్ అసిస్టెంట్ కేడర్ కింద భర్తీ చేయనున్నారు. ఈ పోస్టులలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం నోటిఫై చేసిన 5,089 ఖాళీలు కూడా ఉన్నాయి.

## ఎంపీ, ఎమ్మెల్యేల లంచాల కేసులో

# సుప్రీంకోర్టు సంచలన తీర్పు

**1998లో ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం ఇచ్చిన తీర్పును పక్కనపెట్టేసిన న్యాయస్థానం**

**అలాంటి కేసుల నుంచి రక్షణ కల్పించలేమని స్పష్టీకరణ**

**తీర్పు వెలువరించిన సీజేఐ జస్టిస్ చంద్రచూడ్ నేతృత్వంలోని ఏడుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం**

**పీవీ నరసింహారావు ప్రభుత్వానికి అనుకూలంగా ఓటు వేసిన జేఎంఎం సభ్యులకు సుప్రీం రక్షణ**




**మార్చి4(జర్నలిస్ట్ వార్త):**
ఎంపీ, ఎమ్మెల్యేల లంచాల కేసులో సుప్రీంకోర్టు ఈ రోజు సంచలన తీర్పు వెలువరించింది. ఇలాంటి కేసుల్లో చట్టసభ్యులకు ఎలాంటి మినహాయింపు ఉండదని చీఫ్ జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ఏడుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం స్పష్టం చేసింది. చట్టసభల్లో ఓటు వేయడానికి, ప్రశ్నలు అడిగేందుకు లంచం తీసుకున్న కేసుల్లో ఎంపీ, ఎమ్మెల్యేలకు రక్షణ కల్పిస్తూ 1998లో ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం ఇచ్చిన తీర్పును ఈ సందర్భంగా పక్కన పెట్టేసింది.

పార్లమెంటరీ అధికారాల ద్వారా లంచం రక్షింపబడదని పేర్కొన్న న్యాయస్థానం.. 1998 నాటి తీర్పు వివరణ రాజ్యాంగంలోని 105, 194 ఆర్టికల్స్‌కు విరుద్ధమని స్పష్టం చేసింది. ప్రజల ద్వారా ఎన్నుకోబడిన ప్రతినిధులు భయం లేకుండా పనిచేసేందుకు ఈ రెండు అధికరణలు వారికిప్రాసిక్యూషన్ నుంచి చట్టపరమైన మినహాయింపును అందిస్తాయి.

పీవీ నరసింహారావు కేసు తీర్పుతో తాము విభేదిస్తున్నట్టు రాజ్యాంగ ధర్మాసనం పేర్కొంది. పార్లమెంటులో ఓటు వేసేందుకు, లేదంటే ప్రసంగించేందుకు లంచం తీసుకున్నారనే ఆరోపణలపై చట్టసభ్యుడికి మినహాయింపునిస్తూ ఇచ్చిన తీర్పు విస్తృత పరిణామాలు కలిగి ఉందని, కాబట్టి దానిని రద్దు చేసినట్టు సీజేఐ స్పష్టం చేశారు.

### అసలింతకీ ఏంటా కేసు?


జులై 1993లో అప్పటి ప్రధాని పీవీ నరసింహారావు ప్రభుత్వంపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టగా అనుకూలంగా 265, వ్యతిరేకంగా 251 ఓట్లు రావడంతో ప్రభుత్వం స్వల్ప తేడాతో గట్టెక్కింది. ఇది జరిగిన ఏడాది తర్వాత ప్రభుత్వంపై అవినీతి ఆరోపణలు వెల్లువెత్తాయి. అప్పటి ఝార?ండ్ ముక్తి మోర్చా ఎంపీలు పీవీ నరసింహారావు ప్రభుత్వానికి అనుకూలంగా ఓటు వేసేందుకు లంచం తీసుకున్నారన్న ఆరోపణలు చుట్టుముట్టాయి. ఈ కేసులో 1998లో సుప్రీంకోర్టు తీర్పునిస్తూ పైన పేర్కొన్న రెండు అధికరణల ద్వారా ఆరోపణలు ఎదుర్కొన్న వారికి ప్రాసిక్యూషన్ నుంచి మినహాయింపు లభిస్తున్నట్టు పేర్కొంది. కాగా, తాజా తీర్పులో సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని రాజ్యాంగ ధర్మాసనం నాటి తీర్పుతో విభేదించింది. పార్లమెంటరీ అధికారాల ద్వారా లంచం కేసులో చట్టసభ్యులు మినహాయింపు పొందలేరని స్పష్టంగా తీర్పు చెప్పింది.




# కాంగ్రెస్, బీజేపీ చీకటి ఒప్పందం బయటపడింది

## : పల్లా రాజేశ్వర్ రెడ్డి

**మార్చి4(జర్నలిస్ట్ వార్త):**
ఆదిలాబాద్ సభ వేదికగా కాంగ్రెస్, బీజేపీ చీకటి ఒప్పందం బయటపడిందని బీఆర్ఎస్ నేత, ఎ జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి అన్నారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ... ఈ సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ ప్రధాని మోదీని పెద్దన్న అంటే, ప్రధాని మోదీ సీఎం రేవంత్ రెడ్డిని చిన్నతమ్ముడు అని పరస్పరం పొగుడుకున్నారని గుర్తు చేశారు. ఈ బడేబాయ్... చోటేబాయ్ సంబంధాలు అసెంబ్లీ ఎన్నికలకు ముందు బహిర్గతం కాలేదని, ఇప్పుడు బయటకే కనిపిస్తున్నాయన్నారు.ప్రధాని మోదీ, సీఎం రేవంత్ రెడ్డి మాటలు, వారి ముఖ కవళికలు చూస్తుంటే ఆ రెండు పార్టీల చీకటి ఒప్పందం బయటపడినట్లుగా కనిపిస్తోందన్నారు. తమ ప్రభుత్వం ఉన్నప్పుడు ఇద్దరి పేర్లను ఎమ్మెల్సీలుగా ప్రతిపాదిస్తే గవర్నర్ తమిళిసై ఆ



ఫైలును తిప్పి పంపించారని, కానీ రేవంత్ రెడ్డి ప్రభుత్వం వచ్చాక వారు సూచించిన పేర్లపై సంతకాలు చేశారని ఆరోపించారు. ఇది కూడా ఆ రెండు పార్టీల చీకటి ఒప్పందానికి నిదర్శనమన్నారు.గుజరాత్ మోడల్‌ను, గుజరాత్ అభివృద్ధిని సీఎం రేవంత్ రెడ్డి అంగీకరిస్తే కనుక తెలంగాణ కాంగ్రెస్ పార్టీ బీజేపీ విధానాలకు సహకరిస్తున్నట్లేనని... మోదీ ముందు మోకరిల్లుతున్నట్లే అన్నారు. అదే సమయంలో రాహుల్ గాంధీతో, కాంగ్రెస్‌తో తెలంగాణ కాంగ్రెస్ విభేదిస్తున్నట్లే అన్నారు. ఎందుకంటే గుజరాత్ ఫెయిల్యూర్ మోడల్ అని రాహుల్ గాంధీ అంటుంటే... తనకు గుజరాత్ మోడల్ కావాలని రేవంత్ రెడ్డి చెప్పడం విడ్డూరమన్నారు. అదానీని వద్దు అని రాహుల్ గాంధీ చెబుతుంటే... అదానీ తనకు ముద్దు అని రేవంత్ రెడ్డి అంటున్నారని ఆరోపించారు.

# మార్చి 11 నుంచి యాదాద్రి బ్రహ్మోత్సవాలు !



**మార్చి4(జర్నలిస్ట్ వార్త):**
తెలంగాణలో సుప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన యాదాద్రి నారసింహుల ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు ఈ నెల 11 మొదలవుతాయని ఆలయ అధికారులు వెల్లడించారు. పదకొండు రోజుల పాటు ఉత్సవాలు కొనసాగుతాయి. ఉత్సవాల్లో భాగంగా చేపట్టే ధార్మిక, సాహిత్య, సంగీత, సాంస్కృతికోత్సవాలపై ఆలయ అధికారులు కసరత్తు మ్నొదలుపెట్టారు.

మార్చి 11 తొలిరోజు ఆలయ ఉత్సవాలు విష్వక్సేన ఆరాధనతో మొదలై.. 11 రోజులపాటు కొనసాగి, ద్వాదశి రోజు మార్చి 21 ఉదయాన్నే గర్భాలయంలోని మూలవరులకు చేపట్టే సహస్ర కలశాభిషేకం మహాక్రతువుతో ముగుస్తాయని ఆలయ అధికారులు తెలిపారు. బ్రహ్మోత్సవాల నిర్వహణపై త్వరలోనే రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ ఆ శాఖ కమిషనర్ ప్రత్యేక సమావేశం కానున్నారు.ఉత్సవాలకు ముందస్తు ఏర్పాట్లపై ప్రభుత్వానికి చెందిన వివిధ శాఖల సహకారానికి ఆయా శాఖల అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించేందుకు దేవస్థానం లేఖలు రాసింది. సాంస్కృతిక కార్యక్రమాలను అయిదు రోజులపాటు నిర్వహించనున్నారు. బ్రహ్మోత్సవాల్లో మూడ్రోజుల విశేష ఉత్సవాలు ఈ నెల 17న నిర్వహించే ఎదుర్కోలు సంబరంతో మొదలు కానున్నాయి. 18న రాత్రి శ్రీస్వామి, అమ్మవారల తిరుకల్యాణ మహోత్సవాన్ని ఆలయ ఉత్తర ముఖంగా ఉన్న మాడవీధిలో చేపట్టనున్నారు. 19 నాటి రాత్రి దివ్యవిమాన రథోత్సవం నిర్వహిస్తారు.వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా భాగ్యనగరంలో బర్కత్‌పుర నుంచి శ్రీ లక్ష్మీనరసింహస్వామి అఖండజ్యోతి యాత్ర మార్చి 8న మొదలవుతుందని జ్యోతియాత్ర కమిటీ ఛైర్మన్ సద్ది వెంకట్ రెడ్డి వెల్లడించారు. అక్కడి నుంచి బయల్దేరిన జ్యోతియాత్ర యాదాద్రీశుడి బ్రహ్మోత్సవాల ప్రచారం నిర్వహిస్తూ ఉత్సవాల అంకురార్పణ రోజు ఇక్కడికి చేరుకుంటుందని అన్నారు.

# పాడిరంగం అభివృద్ధికి అన్ని రకాలుగా సహకారం అందిస్తాం

## : మల్లు భట్టి విక్రమార్క

పాడిరంగం అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం నుంచి అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తామని ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క హామీ ఇచ్చారు. డెయిరీ రంగాన్ని మరింత అద్భుతంగా తీర్చిదిద్దుతామన్నారు. తాము ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో వ్యవసాయ అనుబంధ రంగాలకు అధిక నిధులను కేటాయించామని గుర్తు చేశారు. సోమవారం హైదరాబాద్ నగరంలోని మాదాపూర్ హైటెక్స్ ప్రాంగణంలో 50వ పాడిపరిశ్రమ సదస్సు-2024ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మల్లు భట్టి విక్రమార్క మాట్లాడారు.



# ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు జన్మదిన వేడుకలు

## - సంబరాలు జరిపిన పార్టీ శ్రేణులు




వర్ధన్నపేట, మార్చి4(జర్నలిస్ట్ వార్త): వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు జన్మదిన వేడుకలను కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. సోమవారం హనుమకొండ సహృదయ ఫౌండర్ ఎండి చోటే అధ్యక్షతన ఎమ్మెల్యే కార్యాలయ ఆవరణంలో కేక్ కట్ చేసి కార్యకర్తలు సంబరాలు జరుపుకున్నారు. మండల పార్టీ అధ్యక్షులు ఎద్దు సత్య నారాయణ పోశాల వెంకన్న ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ వేడుకల్లో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు అబ్బిడి రాజిరెడ్డి, న్యాయవాది శేఖర్ రావు, జిల్లా నాయకులు పోశాల వెంకన్న గౌడ్, బీసీ సెల్ జిల్లా ఉపాధ్యక్షులు నాంపల్లి వెంకన్న, వార్డు కౌన్సిలర్లు సమ్మెట సుధీర్, ఆంగోతు శ్రీలత, తీగల సునీత, గుజ్జ రవీందర్ రెడ్డి, కర్ర ప్రేమలత రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, బండ సరిత, కొండేటి బాలకృష్ణ, ఇల్లంద గ్రామ పార్టీ అధ్యక్షులు తాళ్లపల్లి శ్రీనివాస్ గౌడ్, గడ్డం సమ్మయ్య, జోగుల పరుష రాములు, నిమ్మనబోయిన పైడి, గుంటి కుమారస్వామి, ఖిమానాయక్ ,నాను నాయక్ ,బెజ్జం పాపారావు, లక్ష్మణ్ నాయక్ ,మైదం బుచ్చిమలు, ఎండి కరీం ,ప్రశాంత్ గౌడ్, ఆరెల్లి ప్రభాకర్, రాజు ,ఝుమార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# మంత్రి సీతక్క ఆకస్మిక తనిఖీ



ఆదిలాబాద్, మార్చి4(జర్నలిస్ట్ వార్త): ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ మండలంలోని ఎందా గ్రామంలో ఆశ్రమ ఉన్నత పాఠశాలను రాష్ట్ర పంచాయతీ రాజ్, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క ఆకస్మిక తనిఖీ చేపట్టారు. సోమవారం స్థానిక ఎమ్మెల్యే వేడ్మ బొజ్జు ఆధ్వర్యంలో పాఠశాల ప్రాంగణం సందర్శించారు. వంటగదితో పాటు తదితర వాటిని పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడారు. ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని, చదువులలో రాణించి, ఉన్నత శిఖరాలను అధిరోహించాలని విద్యార్థులకు దిశా నిర్దేశం చేశారు. వారి వెంట స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

# పేద ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

## - ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి




రాయపర్తి, మార్చి4(జర్నలిస్ట్ వార్త): తెలంగాణ రాష్ట్రంలో పేద ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని పాలకుర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని మైలారం గ్రామంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉచిత గృహజ్యోతి విద్యుత్ పథకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మా ప్రభుత్వంలో ఇచ్చిన మాట ప్రకారం తక్కువ సమయంలోనే ప్రజలకు ఉపయోగపడే పథకాలను అవిష్కరిస్తున్నామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలను అందిస్తామని చెప్పారు. అనంతరం స్థానికంగా ఉన్న వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. స్థానికంగా ఉన్న సమస్యలపై పరిష్కర దిశగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ ఎం శ్రీనివాస్, ఎంపిడిఓ జి కిషన్ నాయక్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జాటోత్ హమ్యా నాయక్, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు వీందర్ రెడ్డి, మండల నాయకులు మాచర్ల ప్రభాకర్, రెంటాల గోవర్ధన్ రెడ్డి, ముద్రబోయిన వెంకన్న, సరికొండ కృష్ణారెడ్డి,మాందాటి సుదర్శన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలి

## - ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి




రాయపర్తి, మార్చి 4(జర్నలిస్ట్ వార్త): మహిళలు అన్ని రంగాలలో అభివృద్ధి చెందాలని పాలకుర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని మండల సమైక్య భవనంలో మండల సమైక్య అధ్యక్షురాలు అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి హాజరైనారు. సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళ దినోత్సవాన్ని మొదట అంతర్జాతీయ మహిళా శ్రామిక దినోత్సవంగా పిలిచేవారని అన్నారు. మన జీవితంలో స్త్రీ ఒక అమ్మ, అక్క చెల్లి, భార్యగా ముందుకు నడిపిస్తుందన్నారు. కొందరు గర్భంలోనే వుండగానే ఆడపిల్లగా నిర్ధారణ చేసుకుని తొలగిస్తున్నారు. ఇంటిని సక్రమంగా తీర్చిదిద్దడం, సమాజాన్ని ఆర్థికంగా, సాంస్కృతికంగా బలపరచడంలో మహిళల పాత్ర కీలకమైందని అన్నారు. మహిళలు ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగా, ఎదగాలని ఆకాంక్షించారు. అనంతరం గ్రామ సంఘాల 299 మంది లబ్దిదారులకు 1, కోటి 49, లక్షల 46, వేల రూపాయలు, 54, కోట్ల రూపాయలు బ్యాంక్ లింకేజ్ ఋణాలను 1, వేయి 35 సంఘాల లబ్దిదారులకు కిషన్ సమృద్ధి యోజన చెక్కులను అందజేశారు. అనంతరం వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఏపీడి అనిత, ఎంపీపీ జినుగు అనిమిరెడ్డి, తహసిల్దార్ ఎం శ్రీనివాస్, ఎంపీడీఓ జి కిషన్ నాయక్, ఏపీఎం కిరణ్ కుమార్, ఎంపీటీసీలు బిల్లా రాధిక రెడ్డి, ఐత రాంచందర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు జాటోత్ హామ్యా నాయక్, మండల అధ్యక్షులు ఇధులకంటి రవీందర్ రెడ్డి, మండల నాయకులు మాచర్ల ప్రభాకర్, సరికొండ కృష్ణారెడ్డి, రెంటాల గోవర్ధన్ రెడ్డి, ముద్రబోయిన వెంకటేశ్వర్లు, మాందాటి సుదర్శన్ రెడ్డి, చిర్రా మల్లయ్య,కుంట రమేష్,కందికట్ల రాజయ్య,ఎండి ఆఫ్రోజ్, మహిముద్, గుగులోత్ యాకుబ్, ఎండి గౌస్, తదితరులు పాల్గొన్నారు.

# రిపేరింగ్ షాపులో అగ్ని ప్రమాదం

## - మంటలు అదుపు చేసిన అగ్నిమాపక శాఖ అధికారులు



**హనుమకొండ, మార్చి4(జర్నలిస్ట్ వార్త):** హనుమకొండ నయీంనగర్ లోని ఓ రిఫ్రిజిరేటర్ రిపేరింగ్ షాపులో సోమవారం అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. స్థానికుల సమాచారం ప్రకారం షార్ట్ సర్క్యూట్ కావడంతో ఒక్కసారిగా షాపులో నుంచి మంటలు సంభవించాయి. జరిగిన ప్రమాదంలో భాగంగా ఆ చుట్టుపక్కల వ్యాపారులు భయాందోళన గురయ్యారు. అగ్ని ప్రమాదానికి గురైన షాపు యాజమాని అగ్నిమాపక శాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. ఇచ్చిన సమాచారం మేరకు సంఘటన స్థలానికి చేరుకున్న అగ్నిమాపక శాఖ అధికారులు అప్రమత్తమై మంటలను అదుపు చేశారు. ప్రమాదం సంభవించిన సమయంలో ఆ షాపులో ఎవరూ లేకపోవడం పెను ప్రమాదం తప్పిందని స్థానికులు భావిస్తున్నారు.

# విద్యార్థుల చదువుపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి

## - నోడల్ అధికారి సృజన్ తేజ



రాయపర్తి, మార్చి4(జర్నలిస్ట్ వార్త): విద్యార్థుల చదువుపై ఉపాద్యాయులు ప్రత్యేక శ్రద్ద చూపాలని మండల నోడల్ అధికారి సృజన్ తేజ అన్నారు. సోమవారం మండలంలోని తెట్టేకుంట తండా పాఠశాలను కొండూరు కాంప్లెక్స్ హెడ్ మాస్టర్ పద్మ సమక్షంలో సందర్శి%శీ%చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాద్యాయులు విద్యార్థుల హాజరు శాతం పెంచాలని అన్నారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని ఆదేశించారు. లేని యెడల పాటించని ఉపాధ్యాయులపై శాఖా పరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు. పాఠశాలలో ఎఫ్ ఎల్ ఎన్ మంత్లీ టెస్ట్ వివరాలను అడిగి తెలుసుకున్నరు. ప్రతి రోజు ఉదయం 10 గంటల లోపే పిల్లలకు ఎఫ్ఆర్ఎస్ చేయాలని సూచించారు. పాఠశాలలో మధ్యాహ్న భోజనం మెను ప్రకారం పెట్టాలని ఆదేశించారు. నాణ్యమైన భోజనం అందించాలని చెప్పారు. పాఠశాలలో వెనుకబడిన పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని జరిగింది.

# ఉపాధి హామీని నిర్వీర్యం చేస్తున్న మోడీ ప్రభుత్వం

## - ఇలాంటి విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమించాలి




హనుమకొండ, మార్చి 4(జర్నలిస్ట్ వార్త): దేశవ్యాప్తంగా జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం నిర్వీర్యం చేస్తుందని సోమవారం తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్ బాలమల్లేష్ అన్నారు. హనుమకొండ బాల సముద్రంలోని సిపిఐ జిల్లా కార్యాలయంలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బాలమల్లేష్ మాట్లాడుతూ వామపక్ష పార్టీలు, వ్యవసాయ కార్మిక సంఘాలు దేశవ్యాప్తంగా ఉద్యమిస్తే నాటి యూపిఏ ప్రభుత్వం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని తీసుకు వచ్చిందన్నారు. కానీ గత పదేళ్లుగా అధికారంలో ఉన్న మోడీ ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేస్తూ పథకాన్ని ఎత్తి వేయటానికి కుట్రలు పన్నుతున్నదని విమర్శించారు. రాబోయే ఎన్నికల్లో మోడీ ప్రభుత్వాన్ని గద్దె దింపి ఇండియా కూటమిని గెలిపించాలని వారు కోరారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు కలకొండ కాంతయ్య మాట్లాడుతూ ఉపాధి హామీ కూలీలకు సక్రమంగా వేతనాలు అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అన్ని జిల్లా కేంద్రాలలో ఉపాధి హామీ సదస్సులు నిర్వహించాలని కోరారు. రాష్ట్రంలో పేదల స్వాధీనంలో ఉన్న ఇండ్ల స్థలాలకు పట్టాలు ఇచ్చి, పక్కా గృహాలు నిర్మించాలి, పేదల స్వాధీనంలో ఉన్న సాగు భూములకు పట్టాలివ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి సృజన్ కుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షులు బి. జంగయ్య, యేసు, సీనియర్ నాయకులు మోతె లింగారెడ్డి, హనుమకొండ జిల్లా సీపీఐ కార్యదర్శి కర్రె బిక్షపతి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు కర్రె లక్ష్మణ్, మద్దెల ఎల్లేష్, మంచాల తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులకు శంఖుస్థాపన



కొడకండ్ల మార్చి4(జర్నలిస్ట్ వార్త): కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు ధారవత్ సురేష్ నాయక్ ఆధ్వర్యంలో సోమవారం పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని ఝాన్సి రెడ్డి నూతన అభివృద్ధి పనులు శంఖుస్థాపన చేశారు. పాలకుర్తి మండల కేంద్రంలో సీసి రోడ్డు, మొండ్రాయి గ్రామంలో సిసిరోడ్డు, సైడ్ డ్రైనేజ్ నిర్మాణ పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వ పాలనలో గ్రామాలు అభివృద్ధికి నోచుకోలేదన్నారు. నిర్లక్షపు పాలనతో ప్రజలను మోసం చేసారని ఆరోపించారు. పాలకుర్తి నియోజకవర్గంలో అన్ని గ్రామాలను ఆదర్శ గ్రామలుగా తీర్చిదిద్దడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం అన్నారు. ఇచ్చిన మాట ప్రకారం ఆరు గ్యారంటీలను కాంగ్రెస్ పార్టీ అమలు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎంపిపి జ్యోతి రవీంద్ర నాయక్, స్థానిక ప్రజా ప్రతినిధులు కే. విజయ లక్ష్మి, అందే యాకన్న జిల్లా నాయకులు సోమ నర్సయ్య, నేమ్మరుగొమ్ముల వెంగల్ రావు, వనం మోహన్, పాలకుర్తి నియోజకవర్గ యువజన అధ్యక్షులు ధరావత్ రాజేష్ నాయక్, మండల నాయకులు అబ్దుల్లా, గ్రామ పార్టీ అధ్యక్షులు మసరం రవీందర్, మండల ముఖ్యనాయకులు, కంటెస్టెడ్ జెడ్పీటిసి రోజా సురేష్ నాయక్, బిక్షపతి బిసి సెల్ అధ్యక్షులు రమేష్, కలీం, మురారి శెట్టి అంజయ్య, దూదిమెట్ల యాకేష్ యాదవ్, మండల పార్టీ ముఖ్య నాయకులు, అధికారులు, యూత్ నాయకులు, తదితరులు, పాల్గొన్నారు.

# తెలుగు మీడియంతోనే ఈ స్థాయికి వచ్చా

**మార్చి4(జర్నలిస్ట్ వార్త):**
హైదరాబాద్ : నాకు ఇంగ్లీషు రాదని కొందరు అవహేళన చేస్తున్నారని, నేను జిల్లా పరిషత్ పాఠశాలలో తెలుగు మీడియాలో చదివానని సిఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. వేలాది గురుకులాలు నిర్మించామని గత పాలకులు గొప్పగా చెబుతున్నారని, ఎక్కడ వాటికి శాశ్వత భ వనాలు నిర్మించలేదని మండిపడ్డారు. సోమవారం ఎల్‌బిస్టేడియంలో ప్రభుత్వ ఉద్యోగాలకు ఎంపికైన 5192 మంది నియామక పత్రాలు అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వసతులు లేని అద్దె భవనాల్లో పేద విద్యార్థులు అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.
రేషనైలేజేషన్ పేరుతో మాజీ సిఎం కెసిఆర్ 6 వేల స్కూళ్లకు తాళాలు వేశారని, కులవృత్తుల వారి పిల్లలు ఆ పనులు చేసుకోవాలని కుట్ర పన్ని ఉన్నత చదువుల వైపు రాకుండా చేశారని ఆరోపించారు. విద్యపై పెట్టే ఖర్చు ఖర్చు కాదని, భవిష్యత్ తరాల నిర్మాణానికి ఉపయోగపడే ఇంధనమన్నారు. ప్రస్తుత



నియమితులైన ఉపాధ్యాయులు తెలంగాణకు అఖిల భారత స్థాయి అధికారులైన ఐఏఎస్, ఐపీఎస్, ఐఆర్ఎస్‌ను, డాక్టర్లు, ఇంజినీర్లను తయారు చేసే బాధ్యతను చేపట్టబోతున్నారని, సర్పంచులు మొదలు ప్రధానమంత్రి వరకు తయారు చేసే బాధ్యత వారిపైనే ఉందన్నారు. తాను రాష్ట్రానికి ముఖ్యమంత్రి అయ్యానంటే ప్రభుత్వ పాఠశాలలో అందించిన విద్యనే కారణమన్నారు.
తాను గుంటూరు, గుడివాడలో చదువుకోలేదని, గుంటూరులోనే, గుంటూరు మరెక్కడో చదువుకున్న కొందరు తనకు అంగ్ల భాష అవమానిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. చైనా, జపాన్, జర్మనీలో వారికి ఇంగ్లీష్ రాదని, కానీ ప్రపంచంలోనే పోటీపడే అభివృద్ధి, ఉత్పత్తులను ఆయా దేశాలు అందిస్తున్నాయని గుర్తు చేశారు. ఇంగ్లీష్ అనేది ఓ భాష, ప్రపంచంలో ఉద్యోగం, ఉపాది కల్పనకు ఉపయోగపడుతుందని, తమ రోజుల్లో నాడు ఉన్న అవకాశాలను పట్టి అక్కడ నేర్పిన చదువులు నేర్చుకున్నామన్నారు. నేడు ప్రపంచంలో ఉద్యోగ అవకాశాలు వచ్చే ఇంగ్లీషును ఉపాధ్యాయులు నేర్పాలని, మీ దగ్గర చదువుకునే పిల్లలకు ఇంగ్లీష్ రాదని అవహేళన చేసే పరిస్థితి రావద్దని సూచించారు. పిల్లలకు మంచి భాషను, దేశభక్తిని నేర్పాలని, వారే రేపటి పాలకులు అవుతారన్నారు.

# 5 స్టేషన్లతో పాతబస్తీకి మెట్రో రైలు..
# మార్చి 8న పనులకు శ్రీకారం !

**మార్చి4(జర్నలిస్ట్ వార్త):**
పాతబస్తీ వాసులు ఎదురుచూస్తున్న మెట్రో రైలు పనులకు తొలి అడుగు పడనుంది. పాతబస్తీ మెట్రో రైలు నిర్మాణ పనుల ప్రారంభానికి ముహూర్తం ఖరారైంది. మార్చి8వ తేదీన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ పనులకు శంకుస్థాపన చేయనున్నారు. ఎంజీబీఎస్ నుంచి ఫలక్‌నుమా వరకు నిర్మించనున్న ఈ మెట్రో మార్గంలో మొత్తం 5 స్టేషన్లు రానున్నాయి. మొత్తం 5.5 కిలోమీటర్ల మార్గంలో చేపట్టనున్న ఈ నిర్మాణానికి సుమారు రూ.2000 కోట్ల వరకు ఖర్చు అవుతుందని అంచనా.

### పాతబస్తీ మార్గంలో 5 మెట్రో స్టేషన్లు:

ఎంజీబీఎస్ నుంచి షిఫా జంక్షన్, పురానీ హవేలీ, ఇత్తెబార్ చౌక్, అలీజాకోట్ల, మీర్ మోమిన్ దర్గా, హరిబౌలి, శాలిబండ, షంషీర్‌గంజ్, అలియాబాద్ మీదుగా ఫలక్‌నుమా వరకు 5.5 కి.మీ. మేర మెట్రో మార్గం ఉంటుంది. ఈ మార్గంలో మొత్తం 5 మెట్రో స్టేషన్లు రాబోతున్నాయి.

1) సాలార్‌జంగ్ మ్యూజియం
2) చార్మినార్
3) శాలిబండ
4) షంషీర్ గంజ్
5) ఫలక్‌నుమా



హైదరాబాద్ మెట్రో ఫేజ్-2 రూట్ మ్యాప్:

మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ శంకుస్థాపన చేసిన రాయదుర్గం %--% విమానాశ్రయం మెట్రో మార్గం నిర్మాణ పనులను పెండింగ్‌లో పెట్టాలని అధికారంలోకి వచ్చిన వెంటనే సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. అనంతరం అధికారులతో పలు దఫాలుగా చర్చల అనంతరం హైదరాబాద్ మెట్రో ఫేజ్-2 విస్తరణకు రూట్ మ్యాప్‌ను ఖరారు చేశారు. ఇందులో భాగంగా మొత్తం 70 కి.మీ. మేర కొత్త మెట్రో మార్గాన్ని నిర్మించేలా అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. మెట్రో విస్తరణ పనుల్లో భాగంగా జేబీఎస్ నుంచి ఎంజీబీఎస్ మీదుగా చాంద్రాయణగుట్ట క్రాస్ రోడ్డు వరకు మెట్రో మార్గాన్ని పొడిగించనున్నారు. కొత్తగా మరో 4 కారిడార్లలో నిర్మాణం చేపట్టనున్నారు.

### ప్రతిపాదిత మెట్రో మార్గాలు:

కారిడార్ 2: ఎంజీబీఎస్ మెట్రో స్టేషన్ నుంచి ఫలక్‌నుమా వరకు (5.5 కి.మీ.)
కారిడార్ 2: ఫలక్‌నుమా నుంచి చాంద్రాయణగుట్ట క్రాస్ రోడ్డు వరకు (1.5 కి.మీ.)
కారిడార్ 4: నాగోల్ నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్టు వరకు (నాగోల్ %--% ఎల్బీ నగర్ %--% చాంద్రాయణగుట్ట %--% మైలార్‌దేవ్‌పల్లి నుంచి విమానాశ్రయం వరకు) %--% (29 కి.మీ.)
కారిడార్ 4: మైలార్‌దేవ్‌పల్లి నుంచి ప్రతిపాదిత హైకోర్టు (రాజేంద్రనగర్) వరకు (4 కి.మీ.)
కారిడార్ 5: రాయదుర్గం నుంచి అమెరికన్ కాన్సులేట్ వరకు (రాయదుర్గం %--% నానక్‌రామ్‌గూడ %--% విప్రో జంక్షన్ నుంచి ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ వరకు) (8 కి.మీ.)
కారిడార్ 6: మియాపూర్ నుంచి బీహెచ్‌ఈఎల్ మీదుగా పటాన్‌చెరు వరకు (14 కి.మీ.)
కారిడార్ 7: ఎల్బీ నగర్ నుంచి వనస్థలిపురం మీదుగా హయత్ నగర్ వరకు (8 కి.మీ.)

# మరింత ముదిరిన ఇడి, ఆప్ వివాదం

**మార్చి4(జర్నలిస్ట్ వార్త):**
న్యూఢిల్లీ : ఆమ్ ఆద్మీపార్టీ అధినేత , ఢిల్లీ సిఎం అరవింద్ కేజ్రీవాల్ మరోసారి ఇడి సమన్లను బే ఖాతరు చేశారు. లిక్కర్ కేసుకు సంబంధించి మ వారం తమ ఎదుట విచారణకు రావాలని ఇడి సమన్లు వెలువరించింది. అయితే ఇప్పుడు తాను రాలేనని, అయినా ఈ నెల 12వ తేదీ తరువాత ఎప్పుడైనా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా విచారణలో పాల్గొంటానని కేజ్రీవాల్ తన లాయర్ల తరఫున వివరణ ఇచ్చారు. ఈ విధంగా దీనితో ఆయన ఇడి సమన్లకు దుమ్మ కొట్టడం ఎనిమిదవ సారి అయింది. ఢిల్లీలోని ఆప్ ప్రభుత్వానికి ఢిల్లీ ఎక్సైజ్ పాలసీ స్కామ్ వీడని నీడలా చుట్టుకుంది. పలువురు నేతలు విచారణలు ఎదుర్కొంటుండగా, కొందరు జైలు పాలయ్యారు. కేజ్రీవాల్ ఇప్పుడు తిరిగి తమ సమన్లను బేఖాతరు చేయడంపై ఇడి వర్గాలు వెంటనే అధికారికంగా స్పం దించాయి. ఆయన సమాధానాన్ని



ముందుగా తాము క్షుణ్ణంగా పరిశీలిస్తామని వెల్లడించారు. అయితే ఆన్‌లైన్ ప్రక్రియలో ఆయనను విచారించేందుకు ఇడి అనుమతిని ఇవ్వకపోవచ్చు.మరోసారి అంటే తొమ్మిదోసారి సమన్లను జారీ చేస్తుందని స్పష్టం అయింది. కాగా తనకు తరచూ సమ న్లు పంపించడంపై ఆప్ నేత ఆగ్రహం వ్యక్తం చేశా రు. ఇదికి సమాధానం ఇవ్వడానికి తాము సిద్ధం అని, అయితే ఇడి ఈ విషయంలో వ్యవహరిస్తున్న తీరు కేవలం రాజకీయ కక్షపూరితం తప్పితే విచారణ క్రమంగా లేదని మండిపడ్డారు. కాగా లోక్‌సభ ఎన్నికల కీలక ఘట్టం దశలోనే కేజ్రీవాల్‌ను ఏదో విధంగా ఈ కేసులో ఇరికించి జైలుకు పంపించేందుకు ఇడి సమాయత్తం అయిందని ఆప్ వర్గాలు నిరసన వ్యక్తం చేశాయి. సమన్లను తిరస్కరించిన కేజ్రీవాల్ ఇప్పుడు ఈ వ్యవహారం న్యాయస్థానం పరిధిలో ఉందని, కోర్టు తుది నిర్ణయం వరకూ వేచి చూడటం ఎవరికైనా మంచిదని సోమవారం తమ ప్రకటనలో తెలిపారు. కాగా తరచూ ఆయన సమన్లను బేఖాతరు చేయడంపై ఇడి స్థానిక సిటికోర్టులో కేసు పెట్టింది. దీనిపై కేజ్రీవాల్ ఈ నెల 16వ తేదీన వ్యక్తిగతంగా హాజరు కావల్సి ఉంటుంది. కాగా ఇటువంటివి తాము పట్టించుకోబోమని కేజ్రీవాల్, ఆయన పార్టీ వర్గాలు స్పష్టం చేశాయి. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా విచారించండి, దీనిని ప్ర త్యక్షంగా ప్రజల వీక్షణానికి ప్రసారం చేయండని ఆప్ డిమాండ్ చేసింది.

# ఖమ్మం, మహబూబాబాద్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థులుగా నామా నాగేశ్వర రావు, మాలోతు కవిత

**ఖమ్మం నుంచి నామాకు, మహబూబాబాద్ నుంచి మాలోతు కవితకు అవకాశం**

**2019లో లక్షన్నర మెజార్టీతో విజయం సాధించిన నామా నాగేశ్వర రావు, కవిత**

**కరీంనగర్ నుంచి వినోద్ కుమార్, పెద్దపల్లి నుంచి కొప్పుల ఈశ్వర్‌కు టిక్కెట్**

**మార్చి4(జర్నలిస్ట్ వార్త):**
రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ నుంచి పోటీ చేసే అభ్యర్థులపై ఆ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కసరత్తు చేస్తున్నారు. ఇందులో భాగంగా నలుగురి పేర్లను ఖరారు చేశారు. ఖమ్మం నుంచి నామా నాగేశ్వర రావు, మహబూబాబాద్ నుంచి మాలోతు కవితలకు మరోసారి అవకాశం కల్పించారు. వీరితో పాటు కరీంనగర్ నుంచి బోయినపల్లి వినోద్ కుమార్, పెద్దపల్లి నుంచి కొప్పుల ఈశ్వర్‌ను ఇప్పటికే అభ్యర్థులుగా ప్రకటించారు.సోమవారం బీఆర్ఎస్ భవన్‌లో ఖమ్మం, మహబూబాబాద్ రెండు పార్లమెంటరీ నియోజకవర్గాల పరిధిలోని ముఖ్య నేతలతో కేసీఆర్ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఈ రెండు నియోజకవర్గాల్లో సిట్టింగులకు మరోసారి అవకాశం కల్పించారు. 2019లో ఖమ్మం నుంచి నామా నాగేశ్వరరావు 1 లక్ష 67వేల మెజార్టీతో, మహబూబాబాద్ నుంచి కవిత 1 లక్ష 46వేల పై చిలుకు మెజార్టీతో విజయం సాధించారు. అభ్యర్థులకు కేసీఆర్ శు భాకాంక్షలు తెలిపారు.



# తెలంగాణలో కాంగ్రెస్ పార్టీకే అత్యధిక ఎంపీ స్థానాలు.

**. వెలువడిన ఇండియా టీవీ-సీఎన్ఎక్స్ ఒపీనియన్ పోల్**

**మార్చి4(జర్నలిస్ట్ వార్త):**
లోక్‌సభ ఎన్నికలు-2024లో తెలంగాణ నుంచి కాంగ్రెస్ పార్టీ అత్యధిక స్థానాలను సొంతం చేసుకోనుందని ఇండియా టీవీ-సీఎన్ఎక్స్ ఒపీనియన్ పోల్ అంచనా వేసింది. రాష్ట్రంలో మొత్తం 17 లోక్‌సభ స్థానాలు ఉండగా అత్యధికంగా 9 స్థానాలను హస్తం పార్టీ గెలవనుందని లెక్కగట్టింది. ఇక బీజేపీ 5 చోట్ల విజయం సాధిస్తుందని విశ్లేషించింది. కరీంనగర్, మహబూబ్‌నగర్, నిజామాబాద్, సికింద్రాబాద్ నియోజకవర్గాల్లో బీజేపీ గెలుస్తుందని విశ్లేషించింది. ఇక రాష్ట్రంలో అధికారాన్ని చేజార్చుకున్న బీఆర్ఎస్ పార్టీ ఈసారి కేవలం 2 స్థానాలకే పరిమితం కానుందని అంచనా వేసింది. ఇక అసదుద్దీన్ సారథ్యంలోని ఏఐఎంఐఎం పార్టీ ఒక సీటులో విజయం సాధిస్తుందని పేర్కొంది. హైదరాబాద్ స్థానాన్ని ఎంఐఎం మరోసారి హస్తగతం చేసుకోనుందని పేర్కొంది. ఇక గత లోక్‌సభ ఎన్నికలు-2019లో టీఆర్ఎస్ (ప్రస్తుతం బీఆర్ఎస్)- 9 సీట్లు, బీజేపీ - 4, కాంగ్రెస్ -3, ఏఐఎంఐఎం -1 సీటు గెలుచుకున్న విషయం తెలిసిందే. అంతకుముందు 2014 లోక్ సభ ఎన్నికల్లో టీఆర్ఎస్- 11, కాంగ్రెస్-2, బీజేపీ-1, ఏఐఎంఐఎం-1, టీడీపీ-1, వైఎస్సార్‌సీపీ-1 చోట్ల విజయం సాధించాయి.

# తెలంగాణ కళా వేదిక జిల్లా అధ్యక్షులుగా పాపయ్య ఎన్నిక



తొర్రూరు, మార్చి4(జర్నలిస్ట్ వార్త): తెలంగాణ కళావేదిక మహబూబాబాద్ జిల్లా అధ్యక్షులుగా రావుల పాపయ్య నియమితులయ్యారు. సోమవారం ఆయన తెలిపిన వివరాల ప్రకారం తెలంగాణ రాష్ట్ర అవతరణ కోసం మలిదశ ఉద్యమంలో ప్రజలను చైతన్య పరుస్తూ, అనేక ప్రజా పోరాటల్లో తన ఆటపాటలతో ప్రజలను చైతన్యపరిచారు. తెలంగాణ రాష్ట్రం సాధనలో కీలకంగా పనిచేసిన ఉద్యమకారులకు స్వరాష్ట్రంలో టీఆర్ఎస్ హయాంలో తీవ్ర అన్యాయం చేశారని ఆరోపించారు. పదేళ్ల పరిపాలనలో నిరుద్యోగ కళాకారులు ఎన్నోసార్లు ప్రభుత్వానికి సాంస్కృతిక సారథికి విన్నవించుకున్నారు. కనీసం వారు పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. ప్రతిభను వెనక్కి తీయకుండా ప్రతి సమావేశాల్లో రాష్ట్ర స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు గ్రామస్థాయి వరకు పల్లెల్లో ఉన్న ప్రతి ఒక్కరిని ఉత్తేజపరిచేందుకు కాలుకు గజ్జలు కట్టినారు. సాంస్కృతిక ఆట పాటలతో తెలంగాణ ఉద్యమంలో ప్రతి ఒక్కరిని ముందుకు నడిపించారు. కళాకారులకు ఏ ప్రభుత్వం పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అలా రాష్ట్ర సాధన కోసం ఉద్యమ సమయంలో తమ వంతు పాత్రను పోషించిన కళాకారుల పరిస్థితి అగమ్య గోచరంగా మారిందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం కళాకారుల ఎడల వివక్షత మాని కళాకారులకు వెంటనే జీవనోపాధి కల్పించాలని వారి కుటుంబాలను ఆదుకొని సహాయ, సహకారాలు అందించాలన్నారు. తనపై నమ్మకంతో జిల్లా అధ్యక్షులుగా నియమించేందుకు రాష్ట్ర అధ్యక్షులు నకిరేకంటి కిరణ్ కుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గజ్వేల్ ప్రతాప్, రాష్ట్ర కార్యదర్శి జవ్వాజి ప్రవీణ్ కుమార్ లకు కృతజ్ఞతలు తెలిపారు.

# హైదరాబాద్‌లోనే ప్రధాని మోడీ: రాజ్‌భవన్‌లో బస, హైఅలర్ట్, 5న సంగారెడ్డి సభకు

**మార్చి4(జర్నలిస్ట్ వార్త):**
హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రంలో ప్రధాని నరేంద్ర మోడీ రెండో రోజుల పర్యటన కొనసాగుతోంది. సోమవారం ఆదిలాబాద్?లో పర్యటించిన ప్రధాని మోడీ.. మంగళవారం రోజు సంగారెడ్డి జిల్లాలో పర్యటించనున్నారు.రేపటి పర్యటన నిమిత్తం, మోడీ సోమవారం రాత్రి రాజ్?భవన్?లో బస చేయనున్నారు. హైదరాబాద్ చేరుకున్న ప్రధాని మోడీకి గవర్నర్ తమిళిసై సౌందరరాజన్, కేంద్రమంత్రి కిషన్ రెడ్డి, డీజీపీ, సీఎస్ సాదర స్వాగతం పలికారు.ప్రధాని మోడీ రాష్ట్రంలో రెండో రోజు పర్యాటనలో భాగంగా సంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా 9వేల 21కోట్ల రూపాయలతో పలు




అభివృద్ధి పనులకు వర్చువల్‌గా శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నారు. అధికారిక సమాచారం మేరకు ప్రధాని మోడీ ఉదయం 10 గంటలకు రాజ్ భవన్ నుంచి బయలుదేరి 10.45 గంటలకు సంగారెడ్డిలో ఏర్పాటు చేసిన సభాప్రాంగాణానికి చేరుకుంటారు. అక్కడి నుంచి జిల్లాలో రూ. 1,409 కోట్లతో నిర్మించిన ఎన్?హెచ్-161 నాందేడ్ అఖోలా జాతీయ రహదారిని మోడీ జాతికి అంకితం చేయనున్నారు. అదే విధంగా సంగారెడ్డి క్రాస్‌రోడ్డు నుంచి మదీనాగూడ వరకు1298 కోట్ల రూపాయలతో ఎన్?హెచ్-65ని 6 లేన్లుగా విస్తరించే పనులకు ప్రధాని మోడీ శంకుస్థాపన చేయనున్నారు. మెదక్ జిల్లాలో రూ. 399 కోట్లతో చేపడుతున్న ఎన్?హెచ్?-765%ఇ% మెదక్-ఎల్లారెడ్డి జాతీయ రహదారి విస్తరణ, 500 కోట్ల రూపాయలతో ఎల్లారెడ్డి-రుద్రూర్ విస్తరణ పనులకు శంకుస్థాపన చేయనున్నారు. అనంతరం 12.30 గంటలకు సంగారెడ్డి నుంచి బయలుదేరి వెళ్తారు. కాగా, ప్రధాని మోడీ, సీఎం రేవంత్ రెడ్డిల రాకతో జిల్లాలోని పటాన్‌చెరు పరిధిలో పోలీసులు ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. మొత్తం 2వేల మంది పోలీసు బలగాలతో సభ ప్రాంగాణానికి మూడు అంచెల భద్రతను ఏర్పాటు చేశారు. ప్రధాని రాకతో భద్రత దృష్ట్యా సభాస్థలానికి 5 కిలో మీటర్ల మేర "నో ఫ్లై జోన్" ఏర్పాటు చేశారు. డ్రోన్ ఎవరు ఎగురవేసినా వారిపై కఠిన చర్యలు తప్పవని ఎస్పీ రూపేష్ హెచ్చరించారు. మరోవైపు, ఉమ్మడి మెదక్ జిల్లాలోని రెండు పార్లమెంట్ పరిధిలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చే బీజేపీ కార్యకర్తలు, మోడీ అభిమానులు సభప్రాంగాణానికి రావడానికి పోలీసులు ట్రాఫిక్ ఆంక్షలు విధించారు.

# బ్యాడ్మింటన్‌కు సాయి ప్రణీత్ వీడ్కోలు



మార్చి4(జర్నలిస్ట్ వార్త): భారత బ్యాడ్మింటన్ స్టార్, హైదరాబాద్ ఆటగాడు భమిడిపాటి సాయి ప్రణీత్ ఆటకు వీడ్కోలు పలికాడు.అంతర్జాతీయ బ్యాడ్మింటన్‌కు సోమవారం రిటైర్మెంట్ ప్రకటించాడు. ప్రియమైన బ్యాడ్మింటన్‌కు ధన్యవాదాలు అంటూ సామాజిక మాధ్యమాల్లో పోస్టు పెట్టాడు. "24 ఏళ్లుగా నాలో భాగమైన ఆటకు విభిన్న భావోద్వేగాలతో వీడ్కోలు పలుకుతున్నా. ఈ రోజు కొత్త అధ్యాయాన్ని మొదలుపెడుతున్న నేపథ్యంలో ఇక్కడివరకూ తీసుకువచ్చిన నా ప్రయాణం పట్ల కృతజ్ఞతతో ఉన్నా. అభిమానుల మద్దతే నాకు గొప్ప బలంగా నిలిచింది. నా కోసం పెట్టిన ప్రతి కేక, ఎగిరిన ప్రతి జెండా నా సంకల్పానికి ఇంధనంలా మారాయి. నా తొలి ప్రేమ, నా నిరంతర సహచరుడివి నువ్వే బ్యాడ్మింటన్. నా వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్ది, నా జీవితానికో అర్థాన్నిచ్చావు. మనం పంచుకున్న జ్ఞాపకాలు, దాటిన సవాళ్లు ఎప్పటికీ నా హృదయంలో పదిలంగా ఉంటాయి. నా తల్లిదండ్రులు, భార్య శ్వేతతో పాటు కుటుంబం నన్నెంతో ప్రోత్సహించింది. మీ మద్దతు లేకపోతే ఇదంతా సాధ్యమయ్యేదే కాదు. అలాగే పుల్లెల గోపీచంద్ అన్నకు, గోపీచంద్ అకాడమీకి, కోచింగ్, సహాయక సిబ్బందికి, చిన్నప్పటి కోచ్‌లు ఆరిఫ్, గోవర్ధన్‌కు ధన్యవాదాలు. ప్రొఫెషనల్ కెరీర్‌ను ముగిస్తున్న నేను.. జ్ఞాపకాలు, స్నేహం, బ్యాడ్మింటన్ ఆటగాడి స్ఫూర్తిని తీసుకెళ్తున్నా. బ్యాడ్మింటన్‌పై నా ప్రేమను కోచ్‌గా, మెంటార్‌గా లేదా ఆటను ప్రచారం చేస్తూ.. ఇలా వివిధ రూపాల్లో ప్రదర్శిస్తూనే ఉంటా" అని ప్రణీత్ పేర్కొన్నాడు.కోచ్‌గా కొత్తగా..: ఆటకు గుడ్‌బై చెప్పిన ప్రణీత్.. అమెరికాలోని ట్రయాంగిల్ బ్యాడ్మింటన్ అకాడమీ ప్రధాన కోచ్‌గా కొత్త ప్రయాణాన్ని మొదలెట్టబోతున్నాడు. 31 ఏళ్ల ప్రణీత్.. 2010 ప్రపంచ జూనియర్ ఛాంపియన్‌షిప్‌లో కాంస్యంతో ఒక్కసారిగా వెలుగులోకి వచ్చాడు. అంతకంటే ముందు 2008 కామన్వెల్త్ యూత్ క్రీడల్లో డబుల్స్ కాంస్యం కూడా నెగ్గాడు. సీనియర్ స్థాయిలోనూ సత్తాచాటాడు. 2017 సింగపూర్ ఓపెన్ టైటిల్ సొంతం చేసుకున్నాడు. సైనా, సింధు, శ్రీకాంత్ తర్వాత సూపర్ సిరీస్ టోర్నీ గెలిచిన నాలుగో భారత షట్లర్‌గా నిలిచాడు. 2019 స్విస్ ఓపెన్ ఫైనల్లో ఓడాడు. అదే ఏడాది ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో కాంస్యంతో 36 ఏళ్ల భారత నిరీక్షణకు తెరదించాడు. ప్రకాశ్ పదుకొనె (1983) తర్వాత ప్రపంచ ఛాంపియన్‌షిప్స్ పురుషుల సింగిల్స్‌లో కాంస్యం నెగ్గింది ప్రణీతే. ఆ తర్వాత శ్రీకాంత్, లక్ష్యసేన్, ప్రణయ్ కూడా పతకాలు గెలిచారు. 2019లోనే అర్జున పురస్కారం అందుకున్న ప్రణీత్.. టోక్యో ఒలింపిక్స్‌లో దేశానికి ప్రాతినిధ్యం వహించాడు. ప్రపంచ ర్యాంకింగ్స్‌లో అత్యుత్తమంగా పదో స్థానంలో నిలిచాడు. పురుషుల జట్టు తరపున ఆసియా టీమ్ ఛాంపియన్‌షిప్స్‌లో రెండు కాంస్యాలు ఖాతాలో వేసుకున్నాడు. కరోనా తర్వాత ప్రణీత్ తిరిగి పుంజుకోలేకపోయాడు. గాయాల కారణంగా వెనుకబడ్డాడు. టాప్-100 లోపు ర్యాంకు కోల్పోయాడు. చివరగా నిరుడు గువాహటి మాస్టర్స్ టోర్నీలో ఆడాడు.

## పక్కా లెక్కలతో వస్తున్న 'ఫ్యామిలీ స్టార్'




రౌడీ స్టార్ విజయ్ దేవరకొండ పరశురామ్ దర్శకత్వంలో చేస్తున్న రెండో సినిమా ఫ్యామిలీ స్టార్. దిల్ రాజు నిర్మిస్తున్న ఈ సినిమా ఏప్రిల్ 5వ తేదీన విడుదల కాబోతోంది. ఇక సినిమా ప్రమోషన్స్ హడావుడి మొదలుపెట్టిన మేకర్స్ నేడు టీజర్ ను విడుదల చేశారు. అనుకున్న సమయం కంటే కాస్త ఆలస్యంగా విడుదలైన ఈ టీజర్ ఇప్పుడు సోషల్ మీడియాలో ట్రెండ్ అవుతుంది. ప్రతిసారి తన డైలాగ్స్ తోనే ఆకట్టుకునే విజయ్ దేవరకొండ మరోసారి తన హావభావాలతో అలాగే అన్ని రకాల ఎమోషన్స్ ను హైలైట్ చేసే ప్రయత్నం అయితే చేస్తున్నట్లు కనిపిస్తోంది. ఫ్యామిలీ స్టార్ పక్కా లెక్కలతో రాబోతున్నట్లు ఒక్క టీజర్ తోనే తెలియజేశారు. ఫ్యామిలీ స్టార్ క్యారెక్టర్ ను హైలెట్ చేస్తూ మంచి రాపో సాంగ్ తో టీజర్ కొనసాగింది. ఒకవైపు కుటుంబంలోని అన్ని రకాల బాధ్యతను సక్రమంగా నిర్వర్తిస్తూనే మరొకవైపు రౌడీల బెండు తీసే క్యారెక్టర్ లో విజయ్ కనిపించబోతున్నట్లు అర్థం అవుతుంది. ఇక టీజర్ చివరలో మరింత హైలైట్ అయ్యే విధంగా విజయ్ కొట్టిన డైలాగ్ గట్టిగానే వైరల్ అయ్యేలా ఉంది. ఇంతకుముందు ఐరెనే వంచాలా? ఏంటి అనే డైలాగ్ ఎంతగా పాపులర్ అయిందో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. ఇక ఇప్పుడు టీజర్ చివరలో హీరోయిన్ కాలేజ్ వరకు దించేస్తారా అని అడగడంతో బండిలో పెట్రోల్ కొట్టిస్తే దించేస్తాను అని చెప్పడం చాలా సరదాగా ఉంది. మొత్తానికి సినిమాలో మిడిల్ క్లాస్ పరిస్థితులుకు తగ్గ ఒక మంచి కామెడీ టచ్ ఉన్నట్లు కూడా అనిపిస్తోంది. విజయ్ తన క్యారెక్టర్ లో ఈసారి మరింత డిఫరెంట్ షేడ్స్ చూపించబోయే అవకాశం ఉన్నట్లు కనిపిస్తోంది. ఇక ఈ సినిమాలో మృణాల్ ఠాగూర్ హీరోయిన్ గా నటిస్తున్న విషయం తెలిసిందే. విజయ్ దేవరకొండ గత సినిమాలకంటే భిన్నంగా ఈ సినిమా రాబోతోంది. ఫ్యామిలీ ఎమోషన్స్ తో పాటు కాస్త యాక్షన్ డోస్ కూడా పరుశురాం జత చేసినట్లు ఈ టీజర్ చెప్పగానే చెప్పేసింది. ఇక ఫ్యామిలీ ఆడియెన్స్ కి ఏ మాత్రం కనెక్ట్ అయినా కూడా ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద మంచి కలెక్షన్స్ అందుకునే అవకాశం ఉంది. మరి ఏప్రిల్ లో రాబోతున్న ఈ సినిమా సినిమా సమ్మర్ హాలిడేస్ ను ఏ విధంగా ఉపయోగించుకుంటుందో చూడాలి.

## మన మధ్య జరుగుతున్న కథలా..

## "షరతులు వర్తిస్తాయి'




"షరతులు వర్తిస్తాయి' నా కెరీర్‌లో ప్రత్యేకంగా గుర్తుండిపోయే చిత్రమవుతుంది. మధ్యతరగతి, దిగువ మధ్యతరగతి వాళ్ల జీవితాల్లో ఉండే సంతోషాలు, బాధలు, అన్ని ఎమోషన్స్ ఈ కథలో ఉంటాయి" అన్నారు చైతన్య రావు.ఆయన.. భూమి శెట్టి జంటగా నటించిన ఈ చిత్రాన్ని కుమారస్వామి తెరకెక్కించారు. నాగార్జున సామల, శ్రీష్ కుమార్ గుండా, కృష్ణకాంత్ చిత్తజల్లు సంయుక్తంగా నిర్మించారు. ఈ సినిమా ఈ నెల 15న విడుదల కానున్న నేపథ్యంలో హైదరాబాద్‌లో ఇటీవల ఈ చిత్ర ట్రైలర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా హీరో చైతన్య రావు మాట్లాడుతూ.. "అందరూ చూడాల్సిన చిత్రమిది. మన మధ్య జరుగుతున్న కథలా ఉంటుంది. నేనిందులో చిరంజీవి అనే పాత్రలో కనిపిస్తా. విజయశాంతి అనే పాత్రలో భూమి నటించింది. ఈ సినిమా నన్ను కుటుంబ ప్రేక్షకులకు దగ్గర చేస్తుందని నమ్ముతున్నా" అన్నారు. "కుటుంబంతో కలిసి థియేటర్లలో చూడాల్సిన చిత్రమిది. దీంట్లో ఇబ్బందికరమైన సన్నివేశాలు ఒక్కటి కూడా ఉండవు" అన్నారు దర్శకుడు కుమారస్వామి. ఈ కార్యక్రమంలో కృష్ణకాంత్, సంతోష్ యాదవ్, భూమి శెట్టి తదితరులు పాల్గొన్నారు.


## బాడీషేమింగ్ గురించి సాయిపల్లవి కామెంట్!



హీరోయిన్ల బాడీషేమింగ్ గురించి నెట్టింట ఏ రేంజ్ లో ట్రోలింగ్ జరుగుతుంటుందో చెప్పాల్సిన పనిలేదు. హీరోయిన్ల రూపాన్ని ఉద్దేశించి రకరకాల అంశాలపై హీరోయిన్లు ట్రోలింగ్ కి గురవుతుంటారు. హీరోయిన్లు ఫేస్ సర్జరీలు చేయించుకున్నా? కొవ్వు సంబంధిత సర్జరీలు జరిగినా హీరోయిన్ల రూపంలో వచ్చే మార్పు ల్ని ఉద్దేశించి రకరకాల ట్రోలింగ్..కామెంట్లు తెరపైకి వస్తుంటాయి. వాటిని హీరోయిన్లు అంతే లైట్ తీసు కుంటారు. సినిమా..మోడలింగ్ రంగంలో ఇవన్నీ ఎంతో సహజమైనవిగా భావిస్తుంటారు. తాజాగా ఈ అంశంపై సాయి పల్లవి కూడా స్పందించింది. %--%మన చుట్టూ ఉన్న ఆడవాళ్లే బాడీషేమింగ్ ని ఎదుర్కొం టున్నారు తప్ప మగవాళ్లు ఎక్కువగా దాని బారిన పడటం లేదంటే సమస్య ఎక్కడుందో అర్థం చేసుకోవచ్చు. రియాల్టీ షోల్లో పాల్గొన్నప్పుడు..సినిమాల్లోకి వచ్చినప్పుడు తొలి నాళ్లలో నా ముఖంపై మెటిమలు ఎక్కువగా ఉన్నప్పుడు నన్ను చాలా మంది ఏడిపించారు. నువ్వు నటించడానికి పనికి రావు అనేవారు. %--%ప్రేమమ్%--% కి ముందు వరకూ చాలా ఆత్మన్యూనతతో బాధపడేదాన్ని. చాలా బాధగానూ అనిపించేది. అయినా సరే చాలా మంది మ్యాకప్ వేసుకోమని ఎంత మంది చెప్పినా వినేదాన్ని కాదు. కేవలం నేను వేసే పాత్ర మీద తప్ప మ్యాకప్ మీద ఏనాడు దృష్టి పెట్టలేదు. అందం కంటే ప్రతిభ మాత్రమే గొప్పదని బలంగా నమ్మి ముందుకెళ్లాను. విమర్శలు ఆరంభంలో బాధపెట్టినా తరువాత వాటిని అలవాటుగా మార్చుకున్నాను. అందం కంటే ప్రతిభ గొప్పదని నమ్మడం వల్లే సౌందర్య ఉత్ప త్తుల్ని బ్రాండింగ్ చేయలేదు. మహిళల కోసం కృషి చేసే ఎన్జీవోల కోసం డబ్బు తీసుకోకుండా ప్రచారం చేయడం ఎంతో ఆనందాన్ని ఇస్తుంది%--% అని అంది. ఈ విషయంలో సాయి పల్లవి చాలా మందిలో స్ఫూర్తిని నింపుతుంది. మ్యాకప్ వేసుకునే భామల నుంచి సాయి పల్లవిని ఈ క్వాలిటీ వేరు చేస్తుంది. నేచురల్ బ్యూటీతోనే ఇప్పటికీ ప్రేక్షకుల్ని మెప్పిస్తుంది. ప్రస్తుతం సాయి పల్లవి కెరీర్ తెలుగులో దేదీప్యమానంగా సాగిపోతుంది. బాలీవుడ్ లో నూ ఇటీవలే ఓ ప్రతిష్టాత్మక చిత్రంలో ఛాన్స్ అందుకుంది.

## నీతో నీ యుద్ధం శివమ్ ..

### 'గామి' నుంచి శంకర్ మహదేవన్ సాంగ్!




విష్వక్సేన్ కథానాయకుడిగా విద్యాధర్ దర్శకత్వంలో 'గామి' సినిమా రూపొందింది. తన ఇమేజ్ కి భిన్నంగా విష్వక్ చేసిన సినిమా ఇది. యూవీ క్రియేషన్స్ వారు నిర్మించిన ఈ సినిమా, ఈ నెల 8వ తేదీన ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ నేపథ్యంలో ఈ సినిమా ప్రమోషన్స్ ఊపందుకున్నాయి. కొంతసేపటి క్రితం ఈ సినిమా నుంచి లిరికల్ వీడియో సాంగ్ ను రిలీజ్ చేశారు.'నీలోని యుద్ధం శివమ్ .. నీతో నీ యుద్ధం శివమ్ .. నీకై నీ యుద్ధం శివమ్' అంటూ ఈ పాట సాగుతోంది. 'నీలో నిను వెదికేది .. నీతో నిను కలిపేది' అంటూ తేలికైన పదాలతో .. లోతైన అర్థాలతో శ్రీమణి చేసిన ప్రయోగాలు బాగున్నాయి. నరేశ్ కుమార్ సమకూర్చిన బాణీకి శ్రీమణి సాహిత్యాన్ని అందించగా, శంకర్ మహదేవన్ ఆలపించారు. ఈ సినిమాలో కథానాయకుడు తన సమస్యకి ఒక పరిష్కారం కోసం హిమాలయాలకు బయల్దేరతాడు. తాను అనుకున్న సమయానికి అక్కడికి చేరుకోకపోతే, ఇక ఎప్పటికీ తాను ఆ సమస్య నుంచి బయటపడలేడు. ఆ ప్రయాణంలో అతనికి ఎలాంటి పరిస్థితులు ఎదురయ్యాయనేది కథ. ఈ సినిమా ఎలాంటి రిజల్టును రాబడుతుందనేది చూడాలి.